క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 45, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 35, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 80, క్యారెట్ 35, దొండ 23–28, చిక్కుడు 70, గోకర 35, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలు 21, దోస 13, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఉత్తమ కార్గో ఏజెంట్ అవార్డు ప్రదానం



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నుంచి అవార్డు అందుకుంటున్న సాయి

మన్సూరాబాద్: ఆటోనగర్‌లో టీఎస్ ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్ సర్వీస్ నిర్వహిస్తున్న ఏజెంట్ పారంద సాయికి ఉత్తమ కార్గో ఏజెంట్ అవార్డు సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా శనివారం రాత్రి అందుకున్నారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ఆటోనగర్‌లో పరిధిలోని కస్టమర్లకు ఉత్తమమైన ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్ సేవలు అందించి, అత్యధికంగా బిజినెస్ ఇచ్చినందుకు అవార్డును అందజేశారని తెలిపారు. పారిశ్రామిక వేత్తలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని, మీ పార్సిళ్లను భద్రంగా నిర్ణీత సమయానికి చేర్చుతామన్నారు. కార్యక్రమంలో కార్గో బిజినెస్ హెడ్ సంతోష్‌కుమార్, గిరి మహేష్‌కుమార్, అమరేందర్‌రాజు, శ్రవణ్‌కుమార్, బాలరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పుష్పాగార్డెన్స్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు. 11కేవీ విద్యుత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పంచాయితీ రాజ్ టీచర్స్ కాలనీ ఫేజ్–1 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, రమాకాంత్‌రెడ్డి, కోశాధికారిగా నర్సింహారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రవినాయక్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీకి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రకటించారు.

ఆటలతో ఆత్మవిశ్వాసం

కార్పొరేటర్ దీపిక

బడంగ్‌పేట్: ఆటలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ దీపిక అన్నారు. హిట్‌మాన్ క్రికెట్ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో సమన్యాయం

జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా

పహాడీషరీఫ్: సీఎం కేసీఆర్ అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా అన్నారు. రాష్ట్రంలో అందరికీ సమన్యాయం అందుతోందని పేర్కొన్నారు. ఆదివారం జల్‌పల్లి గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుకు..

హుడాకాంప్లెక్స్: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ సాయికృష్ణనగర్, క్రాంతినగర్ కాలనీ వాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డు, వందేభారత్ రైళ్లలతో పాటు ఎరువుల కర్మాగారం, జాతీయ రహదారుల అభివృద్ధికి రూ. 9 లక్షల కోట్ల నిధులను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపేందర్‌రెడ్డి, లక్ష్మీనాథచార్యులు పాల్గొన్నారు.

వరద ముంపు సమస్య తీరినట్టే!

- ఐఎస్‌సదన్‌లో పూర్తైన బాక్స్ డ్రెయిన్ పనులు
- డ్రెయిన్ నుంచి నాలాలోకి సాఫీగా వెలుతున్న మురుగు



శంకేశ్వరబజార్ చౌరస్తాలో డ్రెయిన్ నిర్మాణం పూర్తి కావడంతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువుకు ఆనుకొని ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బాక్స్ డ్రెయిన్‌ను అనుసంధానం చేసిన శంకేశ్వరబజార్ నాలాలోకి మురుగునీరు సాఫీగా వెలుతోంది. దీంతో వరద ముంపు సమస్య పరిష్కారమైనట్టేనని ఆయా కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే ఆందోళన..

సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీలలో దశాబ్దాలుగా వర్షం పడుతుందంటేనే ప్రజలు ఆందోళన చెందేవారు. చిన్నపాటి వర్షం కురిసినా వర్షంనీరు కాలనీల్లోని రహదారులను ముంచేసేది. భారీవర్షం పడితే ఇక్కడి కాలనీల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పడవలను ఉపయోగించేవారంటేనే పరిస్థితి ఎలా ఉండేదో అర్థమవుతుంది. ప్రస్తుతం బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తవడం, మురుగునీరు సాఫీగా వెళ్తోంది.

బాక్స్ డ్రెయిన్ నిర్మాణం ఇలా...

ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు తీవ్రంగా ఎదుర్కొంటున్న వరదముంపు సమస్యను పరిష్కరిస్తామని జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో కార్పొరేట్‌గా పోటీ చేసిన జంగం శ్వేతామధుకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా గెలిచిన తరువాత ఆమె అధికారులతో పలుమార్లు సంప్రదించి ముంపు సమస్య తీవ్రతను వివరించడంతో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు ఇక్కడ బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

◆ సింగరేణి ఆఫీసర్స్ కాలనీ రోడ్ నెం.6 నుంచి బతుకమ్మ ఘాట్ మీదుగా శంకేశ్వరబజార్ నాలా వరకు నిర్మించ తలపెట్టిన బాక్స్ డ్రెయిన్ పనులకు 2022 జనవరి 28న యాకుత్‌పురా ఎమ్మెల్యే పాషాఖాద్రీ, ఐఎస్‌సదన్ కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా... పలు అవాంతరాల కారణంగా ఆలస్యమవుతూ ఎట్టకేలకు డ్రెయిన్ నిర్మాణం పూర్తైంది.

డ్రెయిన్ నిర్మించింది ఇలా...

సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ నాలా వరకు రూ. 7.7 కోట్లతో ఇక్కడ బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించారు. మొత్తం 800 మీటర్లు పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో పూర్తి ఆర్‌సీసీతో బాక్స్ డ్రెయిన్ నిర్మించారు. వర్షం కురిస్తే వరదనీరు రహదారులపై నిలవకుండా డ్రెయిన్ పైభాగంలో అక్కడక్కడ జాలీలు నిర్మించారు. సరూర్‌నగర్ నుంచి సైదాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై శంకేశ్వరబజార్ చౌరస్తా వద్ద నెల రోజులు ట్రాఫిక్‌ను మళ్లించి వేగవంతంగా పనులు పూర్తి చేశారు.



గోల్డేజ్‌హోం మార్గంలో పూర్తైన డ్రెయిన్ పనులు

ఆలస్యమైనా పూర్తిచేశాం

సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, శంకేశ్వరబజార్ కాలనీల మీదుగా శంకేశ్వరబజార్ చౌరస్తాలోని నాలా వరకు చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనుల్లో పలు సాంకేతిక సమస్యలు, అవాంతరాలు ఎదురయ్యాయి. సాంకేతిక సమస్యలను సరిచేస్తూ స్థానికుల అభ్యంతరాలు తొలగించి డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేశాం. ప్రస్తుతం డ్రెయిన్ నుంచి నాలాలోకి మురుగునీరు సాఫీగా వెలుతోంది.

– వెంకట కిరణ్, డీఈ ఎస్‌ఎన్‌డీపీ విభాగం

ఆనందంగా ఉంది



ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వరద ముంపు సమస్య పరిష్కరిస్తామని జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చా. హామీ నెరవేర్చినందుకు ఆనందంగా, సంతృప్తిగా ఉంది. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి జేఎస్‌ఆర్ స్విమ్మింగ్ పూల్ వరకు 2వ దశ బాక్స్ డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. అందుకు అధికారులతో ప్రణాళికలు కూడా సిద్ధం చేయించాం. త్వరలో 2వ దశ పనులు కూడా మొదలు పెట్టి మొత్తం డివిజన్ పరిధిలో ముంపు సమస్యను తొలగిస్తాం.

–జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్

తెలంగాణ ఉద్యమంలో ఎల్‌బీనగర్‌ది కీలక పాత్ర

- మధుయాష్కి గౌడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుయాష్కి గౌడ్

హయత్‌నగర్: తెలంగాణ ఉద్యమంలో ఎల్‌బీనగర్ ప్రజలు కీలకంగా వ్యవహరించారని, శ్రీకాంతాచారి పాణత్యాగంతో ఉద్యమం ఉవ్వెత్తున లేచిందని, ఉద్యమ సమయంలో ఎలాంటి ఆందోళనకు పిలుపునిచ్చినా ఇక్కడి ప్రజలు విజయవంతం చేశారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. శనివారం రాత్రి హయత్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ గార్డెన్స్‌లో అడ్వొకేట్ జేఏసీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ కోసం కాంగ్రెస్ నాయకులు తమ పదవులను త్యాగం చేయడమే కాకుండా అధిష్టానాన్ని ఒప్పించి తెలంగాణను సాధించామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసి తమ స్వార్థం కోసం పార్టీ ఫిరాయించిన వారిని తప్పకుండా ఓడించాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. అందుకే ఫిరాయింపుదారులను ఓడించేందుకు ఆయా స్థానాల్లో బలమైన అభ్యర్థులను పోటీకి నిలపాలనే ఉద్దేశంతో నేను ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల నాయకులను ఎల్‌బీనగర్ ప్రజలు ఆదరిస్తారని, ఇందుకు ఆర్.కృష్ణయ్య గెలుపే నిదర్శనమన్నారు. ఇక్కడి స్థానికుడినైన తాను 2004లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలనుకున్నాని, కమ్యూనిస్టులతో పొత్తు కారణంగా నిజామాబాద్ నుంచి పోటీ చేయాలని అధిష్టానం సూచించిందని ఆయన అన్నారు.

పేదల ఆకలి తీర్చడం అదృష్టంగా భావిస్తున్నా..



రైస్ ఎటీఎం వద్ద పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న దోసపాటి రాము

మన్సూరాబాద్: పేదల ఆకలిని తీర్చడం తన అదృష్టంగా భావిస్తున్నానని రైస్ ఎటీఎం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఎటీఎం వద్దకు ఆదివారం వచ్చిన పేదల కష్టాలు తెలుసుకుని వారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, భర్త చనిపోయి ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్న వారితో కుట్టుమిషన్, తోపుడు బండి, టీ షాప్, ఇస్త్రీ షాప్ వంటివి పెట్టించి స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు రాఘవేందర్, కిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో చెత్త వేసి కాల్చిన వ్యక్తిపై కేసు నమోదు



మమతానగర్‌లో చెత్తను డంప్ చేస్తున్న దృశ్యం

నాగోలు: ఇతర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను తీసుకొచ్చి కాలనీలో కాల్చారు. కాలనీవాసులు ఈ విషయంపై నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..నాగోలు మమతానగర్ కాలనీలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి కాలనీలో కాల్చారు. ఇది గమనించిన కాలనీ వాసి శ్రీనివాస్ నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి చెత్తను తీసుకొచ్చి కాల్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చెత్తను తరలించిన డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని, ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాగోలు సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలి

- కాంగ్రెస్ నేత వజీర్ ప్రకాశ్‌గౌడ్



ఈడబ్ల్యూఎస్ విధానాన్ని రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: అగ్రవర్ణ పేదల కోసం తీసుకవచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నేత వజీర్ ప్రకాశ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ గాంధీనాయక్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన వజీర్ ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన అగ్రవర్ణాల రిజర్వేషన్లతో ఇటీవల నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యువత ఉన్నత చదువులు చదివినా కూడా ఉద్యోగ అవకాశాలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, రాజునాయక్, శివనాయక్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం:సామ



స్వచ్ఛ రిక్షాలను పంపిణీ చేస్తున్న సామ రంగారెడ్డి

చైతన్యపురి: పారిశుద్ధ్య కార్మికులకు చెత్త రిక్షాలు, చీపుర్లు తదితర పనిముట్లు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పారిశుద్ధ్యం పడకేసిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు సామ రంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని స్వచ్ఛ రిక్షా కార్మికులకు వివేకానందనగర్‌లో ఆదివారం స్వచ్ఛ రిక్షాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయనతో పాటు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛ రిక్షాలు లేకపోవడంతో చెత్త తరలింపుపై కాలనీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత ఫిబ్రవరి మాసం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఎల్‌బీనగర్ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వస్తున్నాడని, ప్రజలు నమ్మవద్దని కోరారు. ఎల్‌బీనగర్ నుంచి బీజేపీ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జవాను యాదగిరి, ఎస్‌ఎఫ్‌ఎ యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు రామిరెడ్డి, ఓంకార్, మురళీ, లక్ష్మిదేవి, వెంకటేష్‌చారి, అనిల్, రాజేశ్వరి, దయాకర్, సందీప్, శివరామ్, వెంకట్‌రెడ్డి, గౌతంనగర్‌కాలనీ అధ్యక్షుడు క్లెం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్యానాంజనేయుడిని దర్శించుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నిరంజన్‌రెడ్డిని మంత్రోచ్ఛారణతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, తిరుమలేష్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, ఛాత్రి మధుసూదన్‌సాగర్, గూడూరు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో 'మేరా మట్టి, మేరా దేశ్'

బడంగ్‌పేట్: బాలాపూర్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మేరా మట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బాలాపూర్ ప్రజల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సంపత్‌రెడ్డి, అరవింద్, శ్రీశైలం, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

'హోలీమదర్'లో గ్రాడ్యుయేషన్ డే

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల కేంద్రంలో ఉన్న హోలీమదర్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు.అనంతరం బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి మార్కులు, ర్యాంకులు సాధించి చదువులు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సునితాభూపాల్,ప్రిన్సిపల్ మాధవి,అధ్యాపకులు,పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని మాస్టర్‌మైండ్ ఎడ్యూకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయల పాత్రకు వెలకట్టలేమన్నారు.

ప్రధానికి రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారు: అందెల



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీరాములు, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కృష్ణా నది జలాల నీటి పంపకం విషయంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న గొడవలకు పరిష్కారం చూపుతూ కృష్ణా ట్రిబ్యునల్ బోర్డుతో పాటు నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డును ఏర్పాటు చేసిన నందు తెలంగాణ ప్రజలు ప్రధాని మోదీకి రుణ పడి ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాముల యాదవ్, ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కే పురం హనుమాన్ ఆలయం చౌరస్తా వద్ద డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేరీ మాటీ– మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని ప్రతి పౌరుని ఇంటి నుంచి పిడికెడు మట్టిని తీసుకొని స్వతంత్ర భారత దేశ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమర వీరుల జ్ఞాపకార్థం ఢిల్లీలో స్తూపం నిర్మించనున్నట్లు తెలిపారు. ఇంతటి సాహసోపేతమైన నిర్ణయాలను కేంద్ర మంత్రివర్గం చేత ఆమోదింపజేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ముంత రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శులు కందుకూరి సుదర్శన్, వెంకట్ రెడ్డి, మహిళా మోర్చా నాయకులు కరుణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమ, ప్రధాన కార్యదర్శి షకీరా పాల్గొన్నారు.పసుపు బోర్డు, కృష్ణ ట్రిబినల్ బోర్డు ఏర్పటు చేయడం రాష్ట్రానికి మేలు: శ్రీరాములు యాదవ్.

ఎంబీసీలకే కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి



ఎల్‌బీనగర్‌లో నిరసన తెలుపుతున్న సంచార జాతుల నేతలు

మన్సూరాబాద్: రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంబీసీ కులాలకు చెందిన వారినే నియమించాలని తెలంగాణ సంచార జాతుల సంగం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ కోరారు. ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ పదవీని ఎంబీసీ కులాలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్ మాట్లాడుతూ, 2018లో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పడినపుడు ఎంబీసీయేతర కులాల వ్యక్తిని చైర్మన్‌గా నియమించారని, మరోసారి అదే కులాలకు చెందని వ్యక్తినే చైర్మన్‌గా నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్‌కు ఆయా కులాలకు చెందిన వ్యక్తులనే నియమిస్తున్నారని, ఎంబీసీ కార్పొరేషన్‌కు మాత్రం ఇతరులను నియమిస్తూ ఎంబీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను సంచారా జాతులకు కేటాయించే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు బండారు యువరాజు వంశరాజ్, శ్యామల యాదగిరి వంశరాజ్, వేణుగోపాల్, అంబవతి యాదయ్య, శ్రీకాంత్, మల్లేష్, శివ, సుధాకర్, శ్రీను, రాజు, బీసీ కులాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- కాలనీవాసుల డిమాండ్



కాలనీ సంక్షేమ సంఘం భవనం ముందు సమావేశమైన కాలనీవాసులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్–1, 2 నివాసుల సంక్షేమ సంఘం కార్యవర్గం కాలపరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పలువురు కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఆదివారం వనస్థలిపురంలోని కాలనీ సంక్షేమ సంఘం భవనం వద్ద కాలనీవాసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గత 30 ఏళ్ల నుంచి ఇప్పటివరకు ఏకగ్రీవంగా కమిటీలు వేసుకుంటూ వస్తున్నారని, సర్వసభ్య సమావేశాలు గానీ, లెక్కలు గానీ లేవని అన్నారు. కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో అడ్‌హాక్ కమిటీ వేశారని, దాని కాలపరిమితి కూడా ముగిసిపోయిందన్నారు. ఒక వారంలోగా ఎన్నికలు నిర్వహించనట్లయితే తామే ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటామని వారు హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గడ్డం మల్లేష్‌గౌడ్, సాయికిరణ్, ఉప్పు వెంకటేష్, చంటి, పాండురంగారెడ్డి, కిరణ్, ఇంద్రసేనారెడ్డి, క్రాంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీరింగ్ కమిటీ ఎన్నిక...

కాలనీవాసుల సమావేశం ముగిశాక కాలనీకి చెందిన సీనియర్లు కొందరు సమావేశమయ్యారు. ఎన్నికలు నిర్వహించాలన్న కాలనీవాసుల డిమాండ్‌పై చర్చించారు. ఎన్నికలు నిర్వహించాలని తమకు ఉన్నప్పటికీ సంక్షేమ సంఘం బై లాస్ రిజిస్ట్రేషన్ కానందు వల్ల నిర్వహించలేకపోతున్నామని, కాలనీ సమస్యల పరిష్కారం కోసం ఒక స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా కె.లక్ష్మయ్య, కన్వీనర్‌గా కె.శాంతప్ప, సభ్యులుగా బి.అశోక్‌కుమార్, ఆర్.జగదీశ్ కుమార్, ఎన్.అంజన్‌కుమార్, కె.మహదేవ్, డాక్టర్ వి.ప్రభాకర్, డాక్టర్ నందకుమార్, యు.అనూప్‌కుమార్ ఎన్నికైనట్టు చెప్పారు.

నిండా నిర్లక్ష్యం!

- వ్యర్థాలన్నీ రోడ్డుపైనే
- కంపు కొడుతున్న రహదారి
- రూ. కోట్లు వెచ్చించినా అభివృద్ధి శూన్యం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



షాహిన్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెత్త

పహాడీషరీఫ్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు జల్‌పల్లి మున్సిపాలిటీ పరిస్థితి తయారైంది. రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నా.. అధికారుల అలసత్వంతో మూన్నాళ్లకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అధికారులు నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. రూ.8 కోట్లు వెచ్చించి ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వరకు రెండేళ్ల క్రితమే వేసిన రహదారి మురికికూపంగా మారింది. ఎర్రకుంట చౌరస్తాలో బస్తీల నుంచి వస్తున్న మురుగునీరు రోడ్డుపై పారడంతో రహదారి గుంతలమయంగా మారింది. దీనికితోడు స్థానికులు రోడ్డుపైనే నిర్మాణ వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రోడ్డంతా దుర్గంధం

షాహిన్‌నగర్‌లోని హుడా పాఠశాల ప్రాంతంలోని రహదారిపై ఏడాది పొడవునా మురుగునీరు పారుతుండడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. చుట్టుపక్కల ముక్కుపూటలదిరే దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడే పాఠశాలు, ఆస్పత్రులు ఉండడంతో విద్యార్థులు, ప్రజలు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది.

నిర్వహణ లోపం

షాహిన్‌నగర్‌లోని జేజీఆర్ గార్డెన్ సమీపంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోతుండడంతో వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో స్థానికులు చెత్తను రోడ్డుపైనే డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా.. మళ్లీ పేరుకుపోతుంది.